సాక్షి కాకినాడ

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



నలుగురికి కోవిడ్


కాకినాడ క్రైం: జిల్లాలో మంగళవారం నలుగురికి కోవిడ్ నిర్ధారణ అయింది. సోమవారం సేకరించిన 119 నమూనాలను పరీక్షించగా ఈ ఫలితం వెలువడింది.



రూ.2 లక్షల విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కె.శ్రీనివాసరాజు (పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం ఐ.భీమవరం) మంగళవారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 4,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 4,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,400, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 4.50 అడుగులకు చేరింది.



రంజాన్ వేళలు

చండ ప్రచండం

- తారెత్తిస్తున్న ఎండలు
- రాజమహేంద్రవరంలో 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు
- మిగిలిన ప్రాంతాల్లోనూ 38 డిగ్రీలకు పైగా నమోదు
- పది రోజులుగా ఇదే పరిస్థితి
- ఉదయం పది దాటితే హడలెత్తుతున్న జనం

సాక్షి, అమలాపురం: ఇంకా మే నెల రాలేదు.. రోహిణీ కార్తె కూడా కాదు.. అయినప్పటికీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఎండలు తారెత్తిస్తున్నాయి. పొద్దు పొడిస్తే చాలు.. భానుడు ఉగ్రరూపంతో సామాన్యులను అల్లాడిస్తున్నాడు. ఉదయం తొమ్మిది నుంచే చండ ప్రచండంగా చెలరేగిపోతున్నాడు. మిట్ట మధ్యాహ్నమైతే చాలు.. నిప్పుల ఉప్పెన కురిపిస్తున్నాడు. సాయంత్రం ఆరవుతున్నా సూర్యుడి సెగలు తగ్గకపోవడంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పది రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా



అమలాపురం మండలం ఎ.వేమవరంలో జ్వరాలపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్ర ఉష్ణోగ్రతలకు భయపడుతున్న జనం ఉదయం పది గంటలు దాటితే చాలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటితేనే కానీ ప్రజలు బయటకు రావడం లేదు. మజ్జిగ, పండ్ల రసాలు, కూల్ డ్రింకులు ఇలా ఎన్ని తాగినా దప్పిక తీరని పరిస్థితులు నెలకొన్నాయి.

చలివేంద్రాల ఏర్పాటు

తీవ్రమైన ఎండల నేపథ్యంలో మూడు జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థల సమన్వయంతో చలివేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల ఆరంభించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీకి సైతం చర్యలు తీసుకుంటున్నారు.

అగ్నిగుండంలా..

- తూర్పు గోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం కొద్ది రోజులుగా అగ్నిగుండాన్ని తలపిస్తోంది. దాదాపు పది రోజులుగా ఇక్కడ 40 డిగ్రీల సెల్సియస్‌కు పైబడి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం కూడా 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం ఇంతకంటే అధికంగా 43.5 డిగ్రీలు నమోదైంది.



మండే కాలంలోనూ మంచు వర్షం : అంబాజీపేటలో హిమపాతం

కోనసీమలో జ్వరాలు

వేకువనే దట్టమైన మంచు.. ఉదయం 8 గంటల తరువాత విపరీతమైన వేడి, ఉక్కపోత.. ఇటువంటి విచిత్ర వాతావరణం నెలకొనడంతో కోనసీమ జిల్లాలో చిన్నా పెద్దా తేడా లేకుండా పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా సాధారణ ఉడుకు జ్వరాలు, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పలువురు గొంతు ఇన్ఫెక్షన్ బారిన పడుతున్నారు. గొంతు నొప్పితో బాధ పడుతున్నారు. ఒకవైపు కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సాధారణ జ్వరాలు సైతం ఆందోళనకు గురి చేస్తున్నాయి. అధిక ఉడుకు వాతావరణంతో చిన్నారులు చికన్‌పాక్స్ (ఆటలమ్మ) బారిన పడుతున్నారు. కరోనా కేసులు, జ్వరాల నేపథ్యంలో ఆయా జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్‌ఎంలు, ఫ్యామిలీ ఫిజీషియన్ల ద్వారా జ్వర పీడితులకు వైద్య సేవలందిస్తున్నారు.



సూర్యుడు కర్ఫ్యూ విధించినట్టు: రాజమహేంద్రవరంలో నిర్మానుష్యంగా మారిన కంబాలచెరువు - లాలాచెరువు రోడ్డు



వారం రోజులుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

తేదీ	రాజమహేంద్రవరం		కాకినాడ		అమలాపురం	
	గరిష్టం	కనిష్టం	గరిష్టం	కనిష్టం	గరిష్టం	కనిష్టం
12	42.5	28.0	37.9	24.7	36.0	24.1
13	42.5	26.5	38.2	25.9	37.8	25.0
14	43.0	26.0	38.3	25.3	38.0	26.0
15	45.0	26.5	38.0	25.4	38.5	25.0
16	43.0	27.5	38.8	27.0	38.5	27.0
17	43.5	26.0	38.05	26.4	38.5	26.0
18	43.0	24.5	37.9	24.8	38.2	25.0

- మరోపక్క జిల్లా కేంద్రమైన కాకినాడలో 38, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- ఈ మూడు జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు వాస్తవానికి పైన పేర్కొన్న విధంగా నమోదవుతున్నా.. వాతావరణాన్ని ప్రభావితం చేసే వివిధ పరిస్థితుల వల్ల ఇంతకంటే ఎక్కువ ఉష్ణతాపాన్నే ప్రజలు చవి చూస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం అధికంగానే నమోదవుతున్నాయి. మంగళవారం రాజమహేంద్రవరంలో 24.5, కాకినాడ 24.8, అమలాపురం 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనివల్ల పలు ప్రాంతాల్లో రాత్రి వేళ సైతం వాతావరణం చల్లబడటం లేదు.
- కోనసీమలో మాత్రం ఉదయం వేళల్లో ఇందుకు భిన్నమైన వాతావరణం నెలకొంటోంది. ఉదయం మంచు కమ్ముకుని, చలి వాతావరణాన్ని తలపిస్తుండగా, మధ్యాహ్నం మార్తాండుడు సెగలు పుట్టిస్తున్నాడు.
- సముద్ర తీర ప్రాంతం కావడంతో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటోంది.
- మంగళవారం అమలాపురంలో 75 శాతం, కాకినాడలో 55 శాతం చొప్పున గాలిలో తేమ నమోదైంది. దీంతో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జ్వరాలున్నాయి

గత నెల కన్నా జ్వర పీడితుల సంఖ్య కొంత తగ్గింది. అయితే ఇప్పటికీ అక్కడక్కడ జ్వరాలతో బాధపడుతున్న వారు ఉన్నారు. సాధారణ ఉడుకు జ్వరాలతో పాటు గొంతు ఇన్ఫెక్షన్, వైరల్ ఫీవర్లు అధికంగా ఉంటున్నాయి. సాధ్యమైనంత వరకూ ఎండలో తిరగకుండా చూసుకోవాలి.

– డాక్టర్ వాసునాయక్, జిల్లా సర్వైలెన్స్ అధికారి

న్యూస్‌రీల్

ఆక్వారంగ అభివృద్ధికి పూర్తి సహకారం



ఎంపెడా అధికారులు, ఆక్వా రైతు ప్రతినిధులతో ఎంపీ గీత

కాకినాడ సిటీ: ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ఎంపీ వంగా గీత కోరారు. కొచ్చిన్‌లో మంగళవారం ఎంపెడా చైర్మన్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మెరైన్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్టు అథారిటీకి ఉన్న స్టాండింగ్ కమిటీలు/ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ ఎక్స్‌పోర్టు కమిటీలను ఎన్నుకున్నారు. గీతను ఎగ్జిక్యూటివ్ స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా ఎన్నుకున్నారు. కోవిడ్ తర్వాత జరుగుతున్న ఎంపెడా సమావేశంలో బడ్జెట్‌కు సంబంధించిన విషయాలపై చర్చించారు. ఆక్వా రంగంలో విదేశాలలో విధి విధానాలు, మార్కెట్ ఇబ్బందులు, యాంటీబయోటిక్స్‌కు సంబంధించి వివిధ విషయాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు ఎంపీ గీత ఒక ప్రకటనలో వివరించారు.

ఈవీఎం గోదాము తనిఖీ



గోదాము తాళాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్ వద్ద ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ కృతికా శుక్లా రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెల ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పరిశీలిస్తామని వివరించారు. ఆమె వెంట ఆర్డీవో బీవీ రమణ, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎన్ సురేంద్ర ఆనంద్, కాకినాడ అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావు, కాకినాడ పట్టణ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జూన్ 12నాటికి స్కూళ్ల రెండో దశ పనులు పూర్తి



నాడు-నేడు పనులపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: మన బడి నాడు-నేడు కింద చేపట్టిన రెండో దశ పనులను జూన్ 12 నాటికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ, మరమ్మతు పనుల పురోగతిపై విద్యా, సమగ్రశిక్ష, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎంఎస్ఐడీసీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో నాడు-నేడు రెండో దశ కింద సుమారు 882 అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లోను, 14 జూనియర్ కళాశాలల్లోను నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్, బాలికల మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుద్దీకరణ ఇలా పది అంశాల్లో పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఈ పనులన్నీ జూన్ 12 నాటికి పూర్తి చేయాలన్నారురు. డీఈఓ కెఎస్‌వీఎస్ అన్నపూర్ణ, సమగ్ర శిక్ష ఈఈ నటరాజన్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్స్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గం

కాకినాడ సిటీ: జిల్లా బీసీ సంక్షేమశాఖ వసతి గృహ సంక్షేమ అధికారుల కార్యవర్గం ఎన్నిక మంగళవారం కాకినాడలో జరిగింది. జగన్నాథపురం తూరంగి రోడ్డులో బీసీ బాలికల వసతి గృహం నెంబర్-2లో సంఘం సమావేశమైంది. సంఘం జిల్లా అధ్యక్షులుగా జనపనీడి వివిఎస్ఎన్ గంగాధర్ (కత్తిపూడి),కార్యదర్శిగా పేదముత్తం విఆర్ చాముండేశ్వరి (ధివిలి), కోశాధికారిగా దోడా సోయబహదూర్ (కాకినాడ), ఉపాధ్యక్షుడిగా పెదపూడి నాగేశ్వరరావు (కాకినాడ), ఉప కార్యదర్శిగా వాసపల్లి స్వరాజ్యలక్ష్మి (పిఠాపురం), చెరుకూరి ఉషారాణి (కాకినాడ), తమరాన విష్ణుమూర్తి (తుని)లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని వసతి గృహాల సంక్షేమ అధికారులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హాస్టల్ వార్డెన్ ఆఫీసర్‌ల సంఘ అధ్యక్షుడు మాడెం పాల్ దైవ కృపావరం, ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి సోయగాల చిత్రం

అన్నవరం: స్వయంభువుగా సత్యదేవుడు వెలసిన రత్నగిరితో పాటు పక్కనే ఉన్న సత్యగిరి, పావన పంపా నది ఒకే చిత్రంలో కనిపించేలా పెద్ద పెయింటింగ్ వేయించి, స్వామివారి వార్షిక కల్యాణ వేదిక వద్ద భక్తులు తిలకించేలా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఐదడుగుల వెడల్పు, పదడుగుల పొడవున ఫొటో తయారు చేయించి ఈఓ కార్యాలయం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసే ఎగ్జిట్ గేటు, సీసీ టీవీలున్న కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ ఫొటోలో టోల్ గేట్, తొలి పావంచా, సత్రాలు, సత్యదేవుని ఆలయం, అన్నదానం, రెండో ఘాట్‌రోడ్, గిరి ప్రదక్షిణ రోడ్డు భక్తులకు తెలిసేలా పేర్కొన్నారు. త్వరలో పెద్ద పెయింటింగ్‌ను వార్షిక కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. తిరుమలలో అన్నదాన పథకం వద్ద గోడకు ఉండే తిరుమల విహంగ వీక్షణం చిత్రం తరహాలోనే దీనిని రూపొందించనున్నారు.

కల్యాణోత్సవాలకు రత్నగిరి ముస్తాబు

సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలకు రత్నగిరి ముస్తాబవుతోంది. ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఇప్పటికే రెండుసార్లు దేవస్థానం అధికారులు, పండితులతో, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. గత ఉత్సవాలకు భిన్నంగా విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు. టీటీడీ బ్రహ్మోత్సవాల తరహాలో విద్యుద్దీపాలంకరణ చేయాలని ఈఓ ఆదేశించినట్టు ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ తెలిపారు.

గతంలో రాజగోపురాలకు ఎల్ఈడీ దీపాల దండలు వేలాడదీసేవారు. ఇప్పుడు సీరియల్ లైట్లతో అందంగా అలంకరించారు. వారం, పది రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని డీఈ చెప్పారు. సత్యదేవుని కల్యాణంలో గోటి తలంబ్రాల పనులకు గత ఆదివారం శ్రీకారం చుట్టారు. మూడు రోజులుగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని గోటి తలంబ్రాలు ఒలుస్తున్నారు. 30 కేజీల ధాన్యం ఒలిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



రత్నగిరి, సత్యగిరులు, సత్యదేవుని ఆలయం, పంపా నదితో కూడిన విహంగ వీక్షణం

సమ్మేటివ్‌కు సర్వం సిద్ధం

- 1 – 9 తరగతులకు రేపటి నుంచి వార్షిక పరీక్షలు
- 1 – 8 వరకూ సీబీఏ, 9వ తరగతికి పాత పద్ధతిలో నిర్వహణ
- ప్రైవేటు పాఠశాలల్లోనూ పైలట్ ప్రాజెక్టుగా సీబీఏ విధానం
- ఉమ్మడి జిల్లాలో పరీక్షలు రాయనున్న 7.47 లక్షల విద్యార్థులు

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా ఫార్మేటివ్ (ఎఫ్ఏ), సమ్మేటివ్ (ఎస్ఏ) అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకోవడంతో వార్షిక పరీక్షల హడావిడిలో విద్యాశాఖ నిమగ్నమైంది. ఈ ఏడాది పరీక్ష విధానంలో ఎస్‌సీఈఆర్‌టీ నూతన విధానాన్ని తీసుకు వచ్చింది. ఎఫ్ఏ-1, 3 పరీక్షలను క్లాస్ రూమ్ బేస్డ్ (సీబీఏ) విధానంలో నిర్వహించిన విద్యా శాఖ ఇప్పుడు వార్షిక పరీక్షలైన ఎస్ఏ-2 పరీక్షలను కూడా ఇదే విధానంలో నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటికే సీబీఏ విధానంలో పరీక్షలను పరిచయం చేయగా, ఇప్పుడు ప్రైవేటు పాఠశాలల్లో కూడా వెయ్యి మంది విద్యార్థులకు తక్కువ కాకుండా సీబీఏ విధానంలో 1 - 8 తరగతులకు ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహించాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డులు (డీసీఈబీ) చర్యలు చేపట్టాయి. సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఈ నెల 20న ప్రారంభమవుతాయి. ప్రాథమిక పాఠశాలలకు 26తో వార్షిక పరీక్షలు ముగుస్తుండగా, 6 - 9 తరగతులకు ఈ నెల 20 నుంచి 29 వరకూ జరుగుతాయి.

పరీక్షల వేళల్లో మార్పులు

- తీవ్రమైన ఎండల నేపథ్యంలో విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షల వేళల్లో స్వల్ప మార్పులు చేశారు.
- 1 - 8 తరగతుల విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరగాల్సిన పరీక్షను ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ నిర్వహిస్తారు.
- 9వ తరగతి పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకూ జరగాల్సి ఉండగా.. ఉదయం 8 నుంచి 11.15 గంటల వరకూ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

సామర్థ్యాలు వెలికి తీసేందుకే..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటు, పక్కా బోధనతో వారి సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్యను అందించడం, ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఈ విధానం దోహదపడనుంది. ఎఫ్ఏ, ఎస్ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-1, 3 పరీక్షలు నిర్వహించగా, వార్షిక పరీక్షలను కూడా సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. ఎఫ్ఏ-2, 4, ఎస్ఏ-1 పాత విధానంలోనే నిర్వహించారు. 9, 10 తరగతులకు ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలు కూడా పాత విధానంలోనే నిర్వహించారు.

బైలింగ్విష్ విధానంలో..

సీబీఏ విధానంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్న పత్రం బైలింగ్విష్ (ద్విభాష) విధానంలో ఉంటుంది. ఇప్పటి వరకూ ఇంగ్లిషు మీడియం వారికి ఆంగ్లంలో, తెలుగు మీడియం వారికి తెలుగులో ప్రశ్న పత్రం ఇస్తున్నారు. నూతన విధానంలో బైలింగ్విష్‌లో ప్రశ్న పత్రం రూపొందించారు. దీనివలన విద్యార్థికి ఇంగ్లిషులో ప్రశ్న అర్థం కాకుంటే తెలుగులో చదివి అర్థం చేసుకుంటాడు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఇస్తారు. 1 - 5 తరగతులకు ఒక్క ఓఎంఆర్, 6 - 8 తరగతులకు రెండు ఓఎంఆర్‌లు ఇవ్వనున్నారు. లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ పరీక్షలకు వేర్వేరు ఓఎంఆర్‌లు వినియోగిస్తారు. విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసేలా ప్రశ్నలు ఉంటాయి. మెకానికల్, అండర్ స్టాండింగ్, అప్లికేషన్ (ఎంయూఏ) విధానంలో ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది.



జిల్లా కేంద్రానికి చేరుకున్న ఓఎంఆర్ షీట్లు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



వార్షిక పరీక్షలను 1 - 8 తరగతులకు సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నాం. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య మండల కేంద్రాలకు పరీక్ష పత్రాలు చేర్చాం. మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు ఏ రోజు పేపర్లు ఆ రోజే తీసుకు వెళ్లాలి. పరీక్ష పేపర్లకు కస్టోడియన్లుగా ఎంఈఓలు వ్యవహరిస్తారు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

పరీక్షల షెడ్యూల్

తేదీ	పరీక్ష	ప్రైమరీ	ఉన్నత
20	తెలుగు	1 – 5	6 – 9
24	ఇంగ్లిషు	1 – 5	---
24	హిందీ	---	6 – 9
25	గణితం	1 – 5	---
25	ఇంగ్లిషు	---	6 – 9
26	ప.వి.	3 – 5	---
26	గణితం	---	6 – 9
27	సంస్కృతం	3 – 5	---
27	సైన్స్	---	6 – 9
28	సోషల్	---	6 – 9
29	కాంపోజిట్ కోర్సులు		6 – 9

షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి

ఎస్‌సీఈఆర్‌టీ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం సీబీఏ విధానంలో పరీక్షలు జరపాలి. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే పకడ్బందీగా నిర్వహించాలి. ప్రైవేటు పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న పరీక్షలను కూడా విజయవంతం చేయాలి.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

ప్రాధాన్య ఆరోగ్య కార్యక్రమాలపై దృష్టి

యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా



వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) పరిధిలో ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ప్రాధాన్య ఆరోగ్య కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వివేకానందహాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆర్ రమేష్‌తో కలిపి 23 యూపీహెచ్‌సీల వైద్యాధికారులతో సమావేశమై సమీక్షించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు అందుకున్న వారి నుంచి ఏఎన్‌ఎంల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, పాఠశాలల్లో కిశోర బాలికలకు రక్త హీనత, గర్భిణులకు రక్త హీనత పరీక్షలు, ఎన్‌సీడీ ఆరోగ్య ఐడీలు, హైరిస్క్ గర్భిణీల ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ, టీకాల కార్యక్రమం తదితరాలపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమాల అమలును విజయవంతంగా అమలు చేసేందుకు జిల్లా డివిజన్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని పేర్కొన్నారు. యూపీహెచ్‌సీల పరిధిలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం సజావుగా అమలయ్యేలా చూడాలన్నారు. ఈ సేవలను ఉపయోగించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని ఆదేశించారు. రెగ్యులర్ ఓపీ సేవలతో పాటు ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ పి రాధాకృష్ణ, డీఐవో డాక్టర్ ఐ ప్రభాకర్, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శ్రీప్రకాష్‌లో 'చిన్నారుల కేరింతలు'

తుని: ఆంధ్రుల వైభవం, సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పేలా నృత్య, నాటక, గేయ రూపాల్లో బుధవారం 'చిన్నారుల కేరింతలు ఉత్సవం' నిర్వహిస్తున్నామని శ్రీప్రకాష్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకే నరసింహారావు మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా 'సాక్షి' ప్రధాన సంపాదకుడు వర్ధెల్లి మురళి, డెక్కన్ కెమికల్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆనందరావు హాజరవుతున్నారన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసౌధంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తుని, పాయకరావుపేట, అన్నవరం శ్రీప్రకాష్ బ్రాంచీలకు చెందిన విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

బూజు జాతి సూక్ష్మ జీవ నియంత్రణ కారకాలకు జాతీయ గుర్తింపు

అంబాజీపేట: కొబ్బరిలో ఆశించే తెగుళ్ల నివారణకు వినియోగించే బూజుజాతి సూక్ష్మ జీవనియంత్రణ కారకాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ట్రైకోడెర్మా స్పీసిస్‌లను ఉపయోగించి కొబ్బరిని ఆశించే గానోడెర్మా, నల్లమచ్చ, మొవ్వ కుళ్ళు తెగుళ్లను సమర్థంగా అరికడుతున్నామని శ్రీనివాసులు తెలిపారు. తమ పరిశోధన స్థానం తెగుళ్ల శాస్త్ర విభాగంలో కనిపెట్టిన బూజుజాతి సూక్ష్మజీవ నియంత్రణా కారకాలైన ట్రైకోడెర్మా ఆస్పిరిల్లమ్, ట్రైకోడెర్మా హర్జియానంలు.. జాతీయ స్థాయిలో కూడా రైతులకు ఉపయోగపడేలా వివిధ పరిశోధన సంస్థల్లో అందుబాటులో ఉండేలా ధ్రువపత్రాలు పొందామని వివరించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ అయిన జాతీయ వ్యవసాయ ప్రాధాన్యతా సూక్ష్మజీవ కార్యాలయం (ఎన్‌బీఏఐఎం), ఉత్తర ప్రదేశ్‌లోని మావోలో ఉన్న సూక్ష్మజీవ కారకాల సేకరణ కేంద్రం(ఎన్ఏఐఎంసీసీ) ఈ ధ్రువపత్రాలు జారీ చేశాయని తెలిపారు. దీంతో తాము రూపొందించిన సూక్ష్మ జీవనియంత్రణ కారకాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్టయిందని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ బూజుజాతి సూక్ష్మ జీవ కారకాలను పొడి, ద్రవ రూపంలో తెగుళ్లు సోకిన కొబ్బరి, ఇతర తోటలకు సేంద్రియ పదార్థంలో కలిపి పాదులో వేయాలని, దీనివలన తెగుళ్ల నియంత్రణ సమర్థంగా జరుగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఈ జీవనియంత్రణ కారకలను వినియోగించి మంచి ఫలితాలు పొందారన్నారు. వీటిని పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసే సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. ఈ పరిశోధనలకు కారకులైన తెగుళ్ల విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, సిబ్బందిని శ్రీనివాసులు అభినందించారు.

నెలాఖరు వరకూ సాగునీరివ్వాలి

తాళ్లరేవు: గోదావరి డెల్టాకు ఈ నెలాఖరు వరకూ సాగునీరు సరఫరా చేయాలని అధికారులకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ నుంచి కాలువలు మూసివేయడం వలన నీటి ఎద్దడి కారణంగా వరి చేలలో మడంపొల్లు వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. అలాగే మండలంలోని సుమారు పది మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపకపోతే వేసవిలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంటుందని అన్నారు.

రైతు ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

- చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తాం
- ఆన్‌లైన్ విధానంపై అన్నదాతల సంతృప్తి
- పౌర సరఫరాల మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- మూడు జిల్లాల రైస్ మిల్లర్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: రైతు ఆనందమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రబీలో రైతులు పండించిన చివరి ధాన్యం గింజ సైతం కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పునరుద్ఘాటించారు. రైతులకు మేలు చేసే ఈ విధానంపై రైస్ మిల్లర్లు సైతం పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల రైస్ మిల్లర్లతో వారి సమస్యలు, ఆలోచనలు నేరుగా తెలుసుకునేందుకు రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటు రైతులకు, అటు మిల్లర్లకు మేలు జరిగే విధంగా ఆన్‌లైన్ విధానంలో ధాన్యం సేకరణ చేపట్టే ప్రక్రియను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది నుంచి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. దువ్వ గ్రామంలో గత ఏడాది ఆందోళన చేసిన వారే.. ఇటీవల అక్కడి రైతుభరోసా కేంద్రం(ఆర్‌బీకే)లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పుడు వచ్చి, ఆన్‌లైన్ విధానంతో ఎంతో మేలు చేకూరుతోందని చెప్పారని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో అమ్మిన ధాన్యానికి డబ్బులు రాక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నామని అన్నారన్నారు. గత ఖరీఫ్‌లో జరిగిన ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించిన చెల్లింపులు పూర్తిగా జరిపారని, ఆఫ్‌లైన్ చెల్లింపులు పెండింగులో ఉండగా.. ఆయా మిల్లర్లతో మాట్లాడామని తెలిపారు. రబీలో ఆరుదల సమస్య ఉండదని, ఎప్పటికప్పుడు లోడ్ దింపుకొని రైతులకు మిల్లర్లు సహకరించాలని కోరారు. మద్దతు ధర విషయంలో గత ఖరీఫ్‌లో ఎదుర్కొన్న ఒడుదొడుకులను అధిగమించేలా మరిన్ని మార్పులు చేశామన్నారు.

ఏ సీజన్‌కు ఆ సీజన్‌లోనే చెల్లింపులు

ఇకపై పంట కొనుగోలు చేసిన సీజన్‌లోనే చెల్లింపులు కూడా జరిగేలా చర్యలు తీసుకున్నామని మంత్రి కారుమూరి చెప్పారు. రైతు సంక్షేమంపై మిల్లర్లు ఆలోచించాలని, వారికి ఏ సమస్య వచ్చినా ఫోనుకు అందుబాటులో ఉంటానని చెప్పారు. మన రాష్ట్రంలో పండించే జయ బొండాల రకం ధాన్యానికి కేరళలో మంచి డిమాండ్ ఉందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గోడౌన్‌లో భద్రపరచడం, ఆన్‌లైన్ విధానంలో సాంకేతిక సమస్యలను మిల్లర్ల నుంచి నేరుగా తెలుసుకునేందుకు ఈ సమావేశం ఉపయోగపడిందని చెప్పారు. కనీస మద్దతు ధర అందించడంతో పాటు, పంట కోత నుంచి మిల్లుకు చేరే వరకూ అయ్యే ఖర్చు రైతుకు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. మిల్లర్లు తప్పనిసరిగా ఆరబోత యంత్రం సమకూర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్‌టీఓలో నమోదైన ధాన్యాన్ని మిల్లుకు తరలించాలని మంత్రి స్పష్టం చేశారు.

మరింత పటిష్టంగా ఆన్‌లైన్ ప్రక్రియ

పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ ప్రక్రియను మరింత పటిష్టంగా రూపొందించామని చెప్పారు. గన్నీ బ్యాగుల సమస్య ఉత్పన్నం కాకుండా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ రూపొందిన సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్ర వ్యాప్తంగా వినియోగిస్తున్నామని తెలిపారు. మిల్లర్లు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాటిని రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూము ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. మిల్లర్లు, రైతుల మధ్య ఎటువంటి లావాదేవీలకూ ఆస్కారం లేదని, రైతు పక్షాన ప్రభుత్వమే మిల్లర్లకు జవాబుదారీ వహిస్తుందని వీరపాండ్యన్ స్పష్టం చేశారు.

- తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, కామన్ వెరైటీ ధాన్యానికి పూర్తి మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని 233 ఆర్‌బీకేలను 147 రైస్ మిల్లులతో అనుసంధానం చేశామన్నారు. ఆన్‌లైన్ విధానంలో ఏ రైతు ధాన్యం ఏ మిల్లుకు వెళ్తోందో తెలియదని చెప్పారు. 65 లక్షల గన్నీ బ్యాగ్‌లు అవసరం కాగా, ఇప్పటికే ఆర్‌బీకేలకు 35 శాతం అందించామన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలు తెలుసుకొనేందుకు జిల్లాలో 22 కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు.
- కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, కాకినాడ జిల్లాలో 200 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా రైస్ మిల్లులతో అనుసంధానించామన్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. రైతుకు, మిల్లర్‌కు ఎటువంటి ఇబ్బందీ లేకుండా తహసీల్దార్ కార్యాలయంలో మూడో మాయిశ్చర్ మెషీన్ అందుబాటులో ఉంచామన్నారు.
- కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ మాట్లాడుతూ, జిల్లాలో 6.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు గాను 389 ఆర్‌బీకేల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల్లోని మాయిశ్చర్ పరికరాలను పరీక్షించామని చెప్పారు. కచ్చితమైన తూకం కోసం తూనికలు – కొలతల శాఖ బృందాన్ని అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలోని 140 మిల్లులకు గాను 120 చోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. గత ఖరీఫ్‌లో మిల్లర్లకు రూ.7 కోట్లకు గాను 80 శాతం వరకూ చెల్లింపులు జరిపామని తెలిపారు.

ప్రభుత్వానికి పూర్తి మద్దతు

రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిలర్ల నుంచి ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. తేమ శాతం విషయంలో గత ఖరీఫ్‌లో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నామని, అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఆర్‌బీకేల్లో తేమ శాతం పక్కాగా నిర్ధారించాలని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా సకాలంలో గన్నీ బ్యాగులు అందిస్తామని, అయితే గత ఖరీఫ్‌లో ఇచ్చిన బ్యాగ్‌లు ఇంకా కొన్ని అందాల్సి ఉందని చెప్పారు. కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్టాభిరామయ్య చౌదరి ధాన్యం కొనుగోలు సమయంలో రవాణా, గోనె సంచుల సరఫరా అంశాలపై ప్రస్తావించారు. జిల్లాను యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు. తూర్పు గోదావరి జిల్లా మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మోహనరెడ్డి మాట్లాడుతూ, గత ఖరీఫ్ సీజన్ బకాయిలను చెల్లించాలని, ధాన్యం రవాణాకు మిల్లర్ సొంత వాహనాలను అనుమతించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పి.ప్రసాదరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎ.కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏబీవీ ప్రసాద్, జిల్లా సహకార అధికారి నాగభూషణం, రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్డీఓలు ఎ.చైత్రవర్షిణి, ఎస్.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

చనిపోయారా.. చంపేశారా!

- బయోడీజిల్ ట్యాంకులోకి దిగిన లారీ డ్రైవర్, క్లీనర్
- ఊపిరి ఆడక ప్రాణభయంతో కేకలు
- బయటకు తీసిన స్థానికులు
- అయినా దక్కని ప్రాణాలు
- వారిని ఎవరో కొట్టి చంపారంటూ బంధువుల ఆందోళన



ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై తులసీరామ్

కాజులూరు: చాన్నాళ్ల కిందట మూత పడిన ఓ బయోడీజిల్ ట్యాంకులోకి దిగిన ఇద్దరు యువకులు అనుమానాస్పద స్థితిలో దుర్మరణం పాలయ్యారు. వారు ఊపిరాడక చనిపోయారని స్థానికులు చెబుతుండగా.. ఎవరో ఉద్దేశపూర్వకంగానే వారిని హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన వివరాలివీ.. కాజులూరు మండలం ఆర్యావటం గ్రామానికి చెందిన తాతపూడి మహేష్ (25), శీల గ్రామానికి చెందిన నేరేడుమిల్లి శివకుమార్(25) గొల్లపాలెంలోని ఒక లారీలో డ్రైవర్, క్లీనర్‌గా పని చేస్తున్నారు. గొల్లపాలెంలోని కాజులూరు రోడ్డులో ఆంజనేయ ట్రేడర్స్ పేరుతో గతంలో బయోడీజిల్ బంక్ ఉండేది. ఇది ఆరు నెలల క్రితం మూత పడింది. ఈ నేపథ్యంలో ఆ బంకు నిర్వాహకులు ఆ బయోడీజిల్ ట్యాంకును బయటకు తీసి ఓ పక్కన పడేశారు. ఆ ట్యాంకు అడుగు భాగంలో కొద్దిగా డీజిల్ ఉంది. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మహేష్, శివకుమార్ ఆ ట్యాంకులోకి దిగారు. తీరా దిగిన తరువాత లోపల ఊపిరి ఆడక కేకలు పెట్టారు. ఆ కేకలు విని అప్రమత్తమైన స్థానికులు.. వెంటనే అక్కడకు చేరుకుని వారిని బయటకు తీశారు. అయితే అప్పటికే ఆ ఇద్దరూ మృతి చెందారు. ఆ యువకులిద్దరూ బంక్ పక్కనే ఉన్న మద్యం షాపు వద్దకు వచ్చి మద్యం తాగి, డీజిల్ కోసం ట్యాంకులోకి దిగారని, ఎండ తీవ్రతకు డీజిల్ వేడెక్కి గ్యాస్ ఏర్పడి, ఊపిరాడక చనిపోయారని స్థానికులు అంటున్నారు.

మృతదేహాలపై గాయాలు

కాగా, మహేష్, శివకుమార్ శరీరాలపై గాయాలు ఉండటంతో ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటన కాదని, ఎవరో ఉద్దేశపూర్వకంగానే వీరిని హత్య చేసి డీజిల్ ట్యాంకులో పడవేశారని ఆరోపిస్తూ మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్, తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ, ఆర్ఐ వై.వేగేశ్వరరావు తదితరులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించారు. ఈ ఘటనపై మృతుల కుటుంబ సభ్యుల ఆందోళనలు, స్థానికుల వాంగ్మూలాల ఆధారంగా విచారణ చేపట్టామని సీఐ శ్రీనివాసరావు, ఎస్సై తులసీరామ్ తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి మాలమహానాడు, మాదిగ ఐక్యవేదిక సభ్యులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని, టెంట్లు వేసి ఆందోళన కొనసాగిస్తున్నారు.



సంఘటన స్థలంలో మహేష్, శివకుమార్ మృతదేహాలు

అందివచ్చిన కొడుకుల మృతితో..

ఆర్యావటం గ్రామానికి చెందిన తాతపూడి అప్పారావుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో మహేష్ చిన్నవాడు. అలాగే శీల గ్రామానికి చెందిన నేరేడుమిల్లి పెద్ద సత్యనారాయణకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా వీరిలో శివకుమార్ చివరి సంతానం. ఇద్దరు పాతికేళ్లు పెంచుకున్న కొడుకులు చేతికి అంది వచ్చారని సంతోషిస్తున్న సమయంలో.. ఈ దుర్ఘటనలో మృతి చెందారంటూ వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్చ్.. కాస్త మారాల్సిందే..

- కృషి విజ్ఞాన కేంద్రం పని తీరు మెరుగు పడాలి
- క్యూఆర్‌టీ శాస్త్రవేత్తల బృందం సూచన



వృత్తిపనిలో శిక్షణను పరిశీలిస్తున్న క్యూఆర్‌టీ శాస్త్రవేత్తలు

రాజానగరం: కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పని తీరు మరింత మెరుగు పడాలని క్విన్‌క్వెన్నియల్ రివ్యూ టీమ్ (క్యూఆర్‌టీ) సూచించింది. కేవీకేల పని తీరుపై ఐదేళ్లకోమారు పరిశీలన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలువురు శాస్త్రవేత్తలతో ఈ బృందాన్ని నియమించింది. ఐసీఏఆర్ మాజీ సీఎస్ డాక్టర్ జేఎస్ సంధు నేతృత్వంలో డాక్టర్ వి.రవీంద్రబాబు, డాక్టర్ ఏఆర్ శర్మ, డాక్టర్ ఏకే వశిష్ఠ, డాక్టర్ జీపీ రావు, డాక్టర్ ఎస్.పటేల్, డాక్టర్ ఏకే మెహతా ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. వీరి వెంట సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ కూడా ఉన్నారు. రాజమహేంద్రవరం సీటీఆర్ఐ ఆధ్వర్యాన గత ఐదేళ్లలో జరిగిన పరిశోధనలు, క్షేత్ర ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలను సమీక్షించడంలో భాగంగా ఈ బృందం మంగళవారం కలవచర్ల కేవీకేని సందర్శించింది. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ, ఆధునిక పనిముట్లు రూపొందించి, అధిక దిగుబడులు సాధించడంతో వారిని చైతన్యపరిచే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కేవీకే పనితీరును ఈ బృందం నిశితంగా పరిశీలించింది. ఇక్కడి ప్రదర్శన క్షేత్రాలను, శిక్షణ కార్యక్రమాలను, పొట్టి మేకలు, కోళ్ల ఫారాలను చూపిస్తూ, వాటి గురించి కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో పలు సమస్యలు గుర్తించారు. కేవీకేలో ప్రారంభంలో మాదిరిగా కార్యకలాపాలు లేవని పేర్కొన్నారు. ఏడుగురు శాస్త్రవేత్తలకు గానూ ఐదుగురు ఉద్యోగ విరమణ చేశారని, మిగిలిన ఇద్దరితోనే కేవీకే నామమాత్రంగా నడుస్తోందని గమనించారు. అవసరమైన సిబ్బందిని త్వరలోనే నియమించుకోవాలని, ఉద్యాన, వ్యవసాయ రంగాలకు అవసరమైన పనిముట్లను, మెషీనరీ షీట్లను తయారు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు, రైతు మహిళలకు వృత్తిపరమైన నైపుణ్యాలను వృద్ధి చేసేవిధంగా శిక్షణ తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఐసీఏఆర్‌కి ఈ బృందం అందజేయనుంది.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశం మందిరంలో నిర్వహిస్తారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా 'ఏజెంట్' ట్రైలర్ లాంచింగ్



అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న హీరో అఖిల్. చిత్రంలో మంత్రి వేణు తదితరులు

కాకినాడ కల్చరల్: అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' సినిమా ట్రైలర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ లాంచ్ చేశారు. స్థానిక మెక్లారిన్ పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, కాకినాడలో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. హీరో అఖిల్ మాట్లాడుతూ, అక్కినేని అభిమానులు తనపై చూపించిన ప్రేమాభిమానాలను గుండెల్లో దాచుకొంటానని చెప్పారు. ఎంతో నిబద్ధతతో రెండేళ్లు కష్టపడి ఈ సినిమా తీశామన్నారు. అభిమానుల కోరిక మేరకు తన తండ్రి నాగార్జున నటించిన 'హలో బ్రదర్' సినిమాను రీమేక్ చేసే ఆలోచన ఉందని చెప్పారు. నిర్మాత సుంకర అనిల్ మాట్లాడూత, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకొనేలా సస్పెన్స్ థ్రిల్లర్‌గా హాలీవుడ్ స్థాయిలో 'ఏజెంట్' సినిమా తీశామని, ఇది తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 28న ఈ సినిమా విడుదల కానుందన్నారు. హీరోయిన్ సాక్షి వైద్య మాట్లాడుతూ, కాకినాడ నగరం చాలా అందంగా ఉందని, తనకు బాగా నచ్చిందని అన్నారు. కాకినాడలో తొలిసారిగా ప్రీరిలీజ్ వేడుక కావడంతో అక్కినేని అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, వింటేజ్ క్రియేషన్స్ అధినేత దేవరపల్లి శివరామ్, వింటేజ్ క్రియేషన్స్ మేనేజర్ కర్రి మోహన్, ప్రతినిధి బెనర్జీ, ప్రకాష్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయానికి నిప్పు పెట్టిన వ్యక్తికి రిమాండ్

అల్లవరం: బోడసకుర్రు సచివాలయంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన నిందితుడు కాగితపు సతీష్ కుమార్‌ను అల్లవరం పోలీసులు అరెస్టు చేసి, మంగళవారం రిమాండుకు తరలించారు. ఎస్సై శ్రీను నాయక్ కథనం ప్రకారం.. బోడసకుర్రు గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ ఆరేళ్లుగా తాండవపల్లిలో నివాసం ఉంటున్నాడు. అతడికి చెందిన అన్ని డాక్యుమెంట్లూ బోడసకుర్రులోనే నమోదై ఉన్నాయి. ఇతడు ఏ వలంటీర్ మ్యాపింగ్‌లోనూ లేడు. ఈ నేపథ్యంలో అతడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మిషన్ వాత్సల్య పథకం కోసం ఇటీవల బోడసకుర్రు సచివాలయానికి వచ్చాడు. అయితే వలంటీర్ మ్యాపింగ్‌లో లేకపోవడంతో సతీష్‌కుమార్‌కు ఎవరూ పని చేయలేదు. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తనకు ఏ పథకమూ వర్తింపజేయడం లేదనే అక్కసుతో అతడు సచివాలయం అరుగుపై పెట్రోల్ పోసి, నిప్పు పెట్టి పరారయ్యాడు. సచివాలయానికి మంటలు వ్యాపించకుండా స్థానికులు ఆర్పి అధికారులకు సమాచారం ఇచ్చారు. కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సతీష్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

ఇంటర్న్‌షిప్‌పై సమీక్ష

కాకినాడ సిటీ: జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు వికాస ఆధ్వర్యాన ఇంటర్న్‌షిప్ ద్వారా శిక్షణ ఇచ్చి, వారిలో నైపుణ్యం పెంపొందించి, ఉద్యోగావకాశాలు అందించే లక్ష్యంతో పరిశ్రమల శాఖ అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం సమావేశం నిర్వహించారు. వివిధ సంస్థల్లో ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ద్వారా 10,418 మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ మురళి, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ, ఏపీఎస్‌పీహెచ్ఈ యూనివర్సిటీ నోడల్ అధికారి చంద్రశేఖర్, ఆదికవి నన్నయ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రెడ్డి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, డీఎస్‌పీఓ హరిశేషు తదితరులు పాల్గొన్నారు.

విద్యను మతపరం చేస్తున్న కేంద్రం



విలేకర్లతో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో విద్యను ప్రైవేటు పరం, మతపరం చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆరోపించారు. జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా స్థాయి జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం మండలంలోని అంగర వచ్చిన వారు విలేకర్లతో మాట్లాడారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానం వల్ల భవిష్యత్తు తరాలు చదువుకు దూరం కావడంతో పాటు మత మౌఢ్యంతో ఛాందస భావాలతో జీవించాల్సిన ప్రమాదం ఉందని అన్నారు. రాజ్యాంగ మౌలిక లక్ష్యాలైన లౌకిక తత్వం, సామాజిక న్యాయాలను కేంద్రం తుంగలోకి తొక్కుతోందని చెప్పారు. విద్యారంగ పరిరక్షణ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు తదితర లక్ష్యాల కోసం యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ, విద్యారంగంలో ప్రైవేటీకరణ పెరుగుతూండటం భవిష్యత్తు తరాల వారికి చదువు అందని ద్రాక్షగా మారుతుందన్నారు. జీడీపీలో 2 శాతం శాస్త్ర, సాంకేతిక రంగానికి ఖర్చు చేయాలని తాము కోరుతున్నామని, కేంద్రం 0.2 శాతం మాత్రమే ఖర్చు చేస్తోందని చెప్పారు. విద్యా, మేధావి రంగాల వారితో ఎటువంటి చర్చలూ జరపకుండా సిలబస్‌లో మహనీయుల చరిత్రలను, చారిత్రక వీరగాథలను తొలగిస్తూ, మతఛాందస చాప్టర్లను పొందుపర్చడం భవిష్యత్తు తరాలకు ప్రమాదమని అన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డీవీ రాఘవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అసోసియేట్ సభ్యులు పి.సురేంద్ర, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరు సూరిబాబు కూడా మాట్లాడారు.